క్లుప్తంగా

విద్యాభివృద్ధికి నా వంతు కృషి చేస్తా



కామారెడ్డి రూరల్: విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రముఖ వ్యాపార వేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రామస్తుల అంతా ఏకమై 27 మంది విద్యార్థులు ఉండే స్కూల్లో 130 మందికి పైగా 10 నెలల్లోనే చేర్పించడం అభినందనీయమన్నారు. మరో 200 మంది విద్యార్థులను పెంచాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారంతోపాటు నా వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులు అందజేశారు. అలాగే పాఠశాలలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సందిరి నారాయణరెడ్డి, సందిరి రాజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బాలకిషన్‌గౌడ్, శ్రీను నాయక్, గోవింద్ నాయక్, ప్రధానోపాధ్యాయుడు నర్సింగ్‌రావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బాన్సువాడ : బీర్కూర్ ఉన్నత పాఠశాలలో 1999–2000 పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేకల విఠల్, రాధాకృష్ణ తదితరులున్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన



నస్రుల్లాబాద్(బాన్సువాడ): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను శుక్రవారం వైద్యుడు గిరిశ్ వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సూర్యకాంత్, సీహెచ్‌వో రవిందర్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు



ఎల్లారెడ్డి: పట్టణంలో మున్సిపల్ సిబ్బంది శుక్రవారం స్పెషల్ డ్రైవ్ ద్వారా ఇంటి పన్ను వసూలు చేశారు. ఇంటింటా తిరుగుతు ఇంటి ట్యాక్సులను చెల్లించాలని యాజమానులకు సూచించారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ఏరియర్స్ చెల్లించాలి



బాన్సువాడ : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన 2017 పే స్కేల్, ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి శంకర్ అన్నారు. శుక్రవారం బాన్సువాడలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ముందుగా పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం పెన్షన్ లేనందున ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వర్తించేలా చూడాలన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు సీనియర్ సిటిజన్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్టీసి ఉద్యోగులు కౌసర్, నాగ్‌నాథ్, మహమూద్, పండరి, ఫరీద్, మనోహర్, రామాగౌడ్, సాయన్న ఉన్నారు.

బీఆర్‌ఎస్ సభకు వెళ్తే సంక్షేమ పథకాలు నిలిపేస్తారా..?

లింగంపేట(ఎల్లారెడ్డి): బీఆర్‌ఎస్ వరంగల్ సభకు వెళ్లే వారికి సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాల్లో బెదిరింపులకు దిగుతున్నారని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దివిటి రమేశ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాలకు వెళ్లి రాజీవ్ యువవికాస్, ఇందిరమ్మ ఇల్లుతో పాటు పలు సంక్షేమ పథకాలను నిలిపివేస్తామని సోషల్ మీడియాలో హెచ్చరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీల స్వేచ్ఛకు భంగం కలిగించడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గాండ్ల నర్సింలు, శ్రీకాంత్, బండి నర్సింలు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతన్నపై టార్పాలిన్ల భారం

- సరఫరా కాని సబ్సిడీ టార్పాలిన్లు
- తడిసి మోపెడవుతున్న ఖర్చు
- పంపిణీ పునరుద్ధరించాలని డిమాండ్



తాటిపత్రులతో ధాన్యాన్ని కప్పుతున్న రైతులు



తాడ్కోల్‌లో అద్దె తాటిపత్రులపై ధాన్యం ఆరబెడుతున్న రైతులు

బాన్సువాడ రూరల్: ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై అందించే టార్పాలిన్లను సరఫరా చేయకపోవడంతో రైతులు తమ పంట ఉత్పత్తులను ఆరబెట్టుకోవడానికి అద్దె టార్పాలిన్లు (తాటిపత్రులు) ఆశ్రయిస్తున్నారు. బాన్సువాడ మండల వ్యాప్తంగా 15,310 ఎకరాల్లో వరిసాగు చేశారు. పంట నూర్పిళ్లు, ధాన్యం ఆరబెట్టడం, వర్షంలో పంట ఉత్పత్తులు తడువకుండా కప్పి ఉంచే పనులు చేసుకుంటున్నారు. ఒక్కొక్కదానికి రోజుకు రూ.10 నుంచి రూ.15 చొప్పున అద్దెకు చెల్లించాల్సి వస్తోంది. ఇలా ఒక్కో రైతుకు కనీసం రూ.2వేల నుంచి 4వేల వరకు భారంగా పడుతోంది.

గతంలో రూ.1250కే తాటిపత్రి..

గతంలో ఉద్యానశాఖ ద్వారా 250జేఎస్ఎం(మందం) కల్గిన నాణ్యమైన 8మీటర్ల పొడువు, 6మీటర్ల వెడల్పు కల్గిన టార్పాలిన్లను 50శాతం సబ్సిడీపై రూ.1250కు అందజేశారు.

తర్వాత ఈ పథకాన్ని వ్యవసాయశాఖకు బదిలీ చేసి కొన్నేళ్లు రైతులకు సబ్సిడీ తాటిపత్రుల పంపిణీ నిలిపివేశారు. దీంతో రైతులు సొంత ఖర్చుతో ఒక్కో టార్పాలిన్ రూ.3వేల వరకు వెచ్చించి ప్రైవేట్‌గా కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఆర్థికంగా భారం కావడంతో రైతులు అద్దె టార్పాలిన్ల వైపు మొగ్గు చూపుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనూ వసతులు శూన్యం

నిబంధన ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సహకార సంఘాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు తాటిపత్రులను రైతులకు అందుబాటులో ఉంచాలి. అకాల వర్షాలు కురిసినప్పుడు కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన ధాన్యం తడవకుండా కప్పడానికి తాటిపత్రులు అందించాల్సి ఉన్నా అది ఎక్కడా అమలు కావడం లేదు. ధాన్యం కొనుగోళ్లతో రూ.లక్షల్లో కమిషన్ పొందుతున్న సహకార సంఘాలు పాతవి, చిరిగి పోయిన తాటిపత్రులను ఉంచి చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని చోట్ల రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీసం నీళ్లు–నీడ సౌకర్యం కూడా కల్పించడం లేదనే ఆరోపణలున్నాయి.

ఊరూరా అద్దె టార్పాలిన్ కేంద్రాలు

రైతుల వద్ద తమ పంట ఉత్పత్తుల నూర్పిడి కోసం కావాల్సినంత తాటిపత్రిలు అందుబాటులో లేకపోవడంతో అద్దె టార్పలీన్లు తీసుకుని పని పూర్తి చేస్తున్నారు. సీజన్ ప్రారంభం కావడంతో ప్రస్తుతం ప్రతి గ్రామ గ్రామాన పొరుగు రాష్ట్రాల నుంచి వ్యాపారులు వలస వచ్చి అద్దెటార్పాలిన్ కేంద్రాలను నెలకొల్పారు. ఒక తాటిపత్రికి రోజుకు రూ.10 నుంచి రూ.15 వరకు అద్దె తీసుకుంటున్నారు. ఒక్కో రైతు కనీసం 10నుంచి 50తాటిపత్రులు అద్దెకు తీసుకుని పంట కోత మొదలుకు 17శాతం తేమ మాత్రమే ఉండేలా ధాన్యం ఆరబెట్టడం, కాంటా పూర్తయ్యే వరకు కనీసం పక్షం రోజులు తాటిపత్రులు వాడుకుని అద్దె చెల్లిస్తున్నారు. ఇలా ఒక్కోరైతు తను సాగు చేసిన భూమిని బట్టి రూ.2వేల నుంచి 8వేల వరకు తాటిపత్రుల అద్దె చెల్లిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

తిరిగి సరఫరా ప్రారంభించాలి



ప్రభుత్వం రైతులకు సబ్సిడీ టార్పాలిన్ల పంపిణీ ప్రక్రియను తిరిగి ప్రారంభించాలి. గత కొన్నేళ్లుగా పంట నూర్పిడి సమయంలోనే అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. అద్దె టార్పాలిన్ల భారం నుంచి విముక్తి కల్పించాలి.

– సాయిలు యాదవ్, రైతు, ఇబ్రహీంపేట్

మలేరియా వ్యాధి నివారణకు కృషి చేయాలి



ఎల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



లింగంపేటలో ..

- పీహెచ్‌సీ వైద్యుల పిలుపు
- ర్యాలీ తీసిన ఆరోగ్య సిబ్బంది

ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట/రామారెడ్డి/నాగిరెడ్డిపేట : మలేరియా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలు పీహెచ్‌సీల వైద్యులు అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బంది పలు చోట్ల ర్యాలీ నిర్వహించారు. ఎల్లారెడ్డిలో ప్రభుత్వాస్పత్రి నుంచి గాంధీచౌక్ వరకు, లింగంపేటలోని ప్రధాన వీధుల్లో, నాగిరెడ్డిపేట మండలకేంద్రంతో పాటు ఆరోగ్య ఉపకేంద్రాలు గల గ్రామాల్లో వైద్యసిబ్బంది గ్రామస్తులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు.ఈసందర్భంగా రామారెడ్డి వైద్యుడు సురేశ్, లింగంపేట వైద్యుడు రాంబాబు, నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ వైద్యుడు సృజన్, మత్తమాల పీహెచ్‌సీ వైద్యులు శరత్‌లు మలేరియా వ్యాధి బారినపడకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మలేరియా వ్యాధి ప్రబలడానికి గల కారణాలను వివరించారు. గ్రామాల్లో పారిశుధ్యం పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని, ఇళ్ల చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. గ్రామాల్లో నిలువ నీరు ఉండకుండా తగుచర్యలు చేపట్టాలన్నారు. మలేరియా వ్యాధి విజృంభణ, వ్యాధి లక్షణాలు, వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీల సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులున్నారు.

ప్రహరీ నిర్మాణ పనులు వెంటనే ఆపాలి

- తమ సొంత భూమిని కబ్జా చేశారని వాపోయిన బాధితురాలు



మాట్లాడుతున్న బాధితురాలు హేమలత

కామారెడ్డి టౌన్: తమ భూమిని కబ్జా చేసుకుని చేపడుతున్న ప్రహరీ నిర్మాణ పనులను ఆపకుంటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని బాధితురాలు హేమలత వాపోయారు. శుక్రవారం ఆమె రామేశ్వరపల్లి లో మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు రామేశ్వరపల్లిలో తమ సొంత భూమి సర్వే నంబర్ 85లో నిర్మల సొసైటీ ఆఫ్ ఫ్రాన్సిస్కాన్ క్లారిస్ట్ సిస్టర్స్ జీవదాన్ కాన్వెంట్ వారు ఒక ఎకరం 28 గుంటల తమ సొంత భూమిని దౌర్జన్యంగా కబ్జా చేయడమే కాకుండా ప్రహరి నిర్మిస్తున్నారని చెప్పారు. ఇటీవల మున్సిపల్ అధికారులు విచారణ చేసి పనులు ఆపాలని నోటీసులు జారీ చేసినా పనులు ఆపడం లేదని, తమకు న్యాయం జరగకుంటే ఆత్మహత్యే శరణ్యమన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

స్థానిక సంస్థల్లో యువత పోటీ చేయాలి



భిక్కనూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత పోటీ చేసి విజయం సాధించాలని యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల యువజనకాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత తలచుకుంటే సాధించలేనిది ఉండదన్నారు.యువత రాజకీయాల్లోకి వస్తే అవినీతి అక్రమాలు తగ్గిపోతాయన్నారు. అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందేలా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్, కిరన్, స్వామి, రమేష్,బాబు, వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి బాల సంస్కార శిబిరం ఏర్పాటు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి శ్రీ కృష్ణ మందిరంలో మే–4 నుంచి 12వ తేదీ వరకు బాల సంస్కార శిబిరం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి మచాలే బాబా తెలిపారు. ఈ శిబిరంలో భగవద్గీత, దేశభక్తి, దైవ భక్తి, ధర్మరక్షణకు సంబంధించిన అంశాలను పిల్లలకు నేర్పించడం జరుగుతుందన్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. శిబిరంలో చేరడానికి ఒక్కో విద్యార్థికి రూ.650 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండుటెండలో గొంగడే గొడుగు



రామారెడ్డి: మండలంలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.పనుల నిమిత్తం బయటకు వచ్చి క్రమంలో కొంతమంది గొడుగులు,టోపీలు వాడుతుంటారు. కురమ సామాజిక వర్గానికి ఎక్కువ మంది ఏకాలమైనా గొంగడిని వాడుతుంటారు. ఈక్రమంలో మండుతున్న ఎండలో రామారెడ్డిలో మల్లయ్య అనే వ్యక్తి గొంగడి కప్పుకొని రోడ్డుపై వెళ్తుండగా ఈదృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. వర్షాకాలం, ఎండాకాలం, చలికాలంలోనూ గొంగడే గొడుగు కంటే ఎక్కువ రక్షణగా నిలుస్తుందని మల్లయ్య తెలిపారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో భక్తులు శుక్రవారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమాత దివ్యసమాధి, ప్రతిమ, చిత్రపటం ప్రత్యేక పూజలు చేశారు.

ఉగ్రవాదుల దాడికి నల్ల బ్యాడ్జీలతో నిరసన



బిచ్కుందలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి నివాళులు అర్పిస్తున్న ముస్లింలు



పిట్లంలో..



జిల్లా గ్రంథాలయ సంస్థలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న సిబ్బంది



తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న యువకులు



మాచారెడ్డిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



కామారెడ్డిలో రెడ్డి ఐక్య సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న నాయకులు

బిచ్కుంద/పిట్లం/బీబీపేట/లింగంపేట: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా శుక్రవారం బిచ్కుందలో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నమాజ్ చేసి నిరసన తెలిపారు. అమరులైన వారికి నివాళిలు అర్పించారు వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. అలాగే పిట్లంలోని నాలుగు మసీద్‌లలో నల్ల రిబ్బన్లు ధరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బీబీపేటలోని జామ మసీదులో ముస్లింలు నల్ల బ్యాడ్జీల ధరించి నమాజ్ చేసి ప్రగాడ సానుభూతి తెలియజేశారు. లింగంపేటలోని ఖద్రియా మాజిద్ ఇమామ్ వజీర్ బేక్‌తో పాటు ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు చేశారు.ఈసందర్భంగా బిచ్కుంద మదీనా మజీద్ అధ్యక్షుడు మహ్మద్ ముఖీద్, పిట్లం మజీద్ కమిటీ అధ్యక్షుడు యాదుల్ మాట్లాడుతూ.. మతం పేరుతో మారణ హోమం సృష్టించడం తగదని, ఈదాడి హేయమైన చర్య అని, ఇలాంటి దాడులను ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మసీదు కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళ్లు

కామారెడ్డి అర్బన్ : పహల్గాం దాడిలో మృతుల ఆత్మకు శాంతికలగాలని కోరుతూ జిల్లా గ్రంథాలయ సంస్థలో సిబ్బంది శుక్రవారం నివాళులు అర్పించి, మౌనం పాటించారు. ఉగ్రవాదం నశించాలని, మతోన్మాదుల భరతం పట్టాలని ప్లకార్డులను ప్రదర్శించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, సంస్థ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో కొవ్వొతుల ర్యాలీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్‌గాం ఉగ్రదాడికి నిరసనగా మండలంలోని బ్రాహ్మణపల్లిలో గ్రామపెద్దలు, యువకులు గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ర్యాలీ తీశారు.

కామారెడ్డి పట్టణంలో..

కామారెడ్డి టౌన్ : కాశ్మీర్‌లోని పహల్గార్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ శుక్రవారం రాత్రి బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వత్తుల ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. దాడిలో మరణించన వారికి మున్సిపల్ కార్యాలయం ముందు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే రెడ్డి ఐక్యసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఉగ్రవాదుల దిష్టి బొమ్మ దహనం

మాచారెడ్డి: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్ గాం ఉగ్ర దాడికి నిరసనగా మాచారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేశారు.అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

'ఇందిరమ్మ'అర్హుల జాబితా పరిశీలన



గోలిలింగాలలో పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోలిలింగాలలో శుక్రవారం ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపికైన అర్హుల జాబితాను పరిశీలించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన అర్హుల ఇళ్లకు వెళ్లి పరిశీలన జరిపారు. ఇల్లు కట్టుకునే తీరుపై అర్హులతో ఆయన చర్చించారు. మండలంలోని ఇతర గ్రామాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక కాబడిన అర్హుల జాబితాపై పరిశీలనను వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రభాకరచారికి ఆయన సూచించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి

బాన్సువాడ రూరల్/తాడ్వాయి/నిజాంసాగర్/ఎల్లారెడ్డిరూరల్ : బాన్సువాడ మండలంలోని నాగారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎంపీడీవో బషీరుద్దీన్ కోరారు. శుక్రవారం ఆయన గ్రామంలో లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. గ్రామంలో మంజూరు వచ్చినా ఇంకా 29మంది నిర్మాణ పనులు ప్రారంభించలేదన్నారు. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి, ఎండ్రియాల్ గ్రామాలలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ పరిశీలించారు. నిజాంసాగర్ మండలం మాగి, మల్లూర్, బంజపల్లి గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. మాగి గ్రామంలో 18, మల్లూర్ గ్రామంలో 28, బంజపల్లి గ్రామంలో 30 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. దీంతో వారి ఇళ్ల స్థలాలను పరిశీలించడంతో పాటు ఇళ్ల నిర్మాణంపై చర్చించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఎల్లారెడ్డి మండలంలోని సోమర్యాగడితాండాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పంచాయత్‌రాజ్ డీఈ గిరిధర్ నిర్వహించారు.ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

శంకరంపేట్‌కు బస్సు సర్వీసు



నిజాంసాగర్(జుక్కల్): ఎల్లారెడ్డి నుంచి నిజాంసాగర్ మండల కేంద్రం మీదుగా శంకరంపేట్‌కు శుక్రవారం బస్సు సర్వీసు ప్రారంభించినట్లు బాన్సువాడ ఆర్టీసీ డిపోమేనేజర్ సరితాదేవి తెలిపారు. బాన్సువాడ డిపో నుంచి బస్సు బయలుదేరి ఎల్లారెడ్డి బస్టాండ్ చేరుతుందన్నారు. ఎల్లారెడ్డి బస్టాండ్ నుంచి నిజాం సాగర్ బస్టాండ్ మీదుగా సంగారెడ్డి జిల్లా శంకరంపేట బస్టాండ్‌కు రోజు నాలుగు ట్రిప్పులు తిరుగుతుందన్నారు. ఆర్డినరి బస్సు సర్వీసును ఆయా మండలాలు, గ్రామాల ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజయ్య అన్నారు. స్థానిక యూనియన్ బ్యాంకులో శుక్రవారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. సైబర్ మోసగాళ్లను నమ్మవొద్దని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, పోలీసు సిబ్బంది, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎల్లారెడ్డి జూనియర్ సివిల్ జడ్జిగా సుష్మ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా సుష్మను నియమిస్తూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. ఎల్లారెడ్డి జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తించిన హారిక బదిలీ కావడంతో ఆమె స్థానంలో హైదరాబాద్‌లో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్, జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న సుష్మ ఎల్లారెడ్డికి బదిలీపై వస్తున్నట్లు వారు తెలిపారు.

పేద ముస్లింల కోసమే వక్ఫ్ చట్టం

లింగంపేట(ఎల్లారెడ్డి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టం పేద ముస్లింల కోసమేనని బీజేపీ మండల అధ్యక్షుడు బొల్లారం క్రాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నాయకులు బాపురెడ్డి, మురళి, దత్తురాం, వెంకట్రావు, విష్ణువర్ధన్, శుభాష్, సంగీత, రజినాకాంత్, ఉదేష్, బాలయ్య, పోశెట్టి, లక్ష్మన్, శివ్వయ్య, నవీన్‌కుమార్, వంశీకృష్ణ , కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో సందడి చేసిన పీజీ విద్యార్థులు

కామారెడ్డి అర్బన్: స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ పీజీ మొదటి సంవత్సరం విద్యార్థులు శుక్రవారం ఆటపాటలతో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. బాల్‌రాజ్‌గౌడ్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, సమన్వయకర్త విశ్వప్రసాద్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి సభాప్రాంగణాన్ని పరిశీలించిన జాజాల



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభప్రాంగణాన్ని శుక్రవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. సభాప్రాంగణంలోని వేదికతోపాటు నియోజకవర్గం నుంచి వెళ్లే వాహనాల పార్కింగ్, సభకు వచ్చే కార్యకర్తలకు కల్పించాల్సిన వసతుల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

నిజాంసాగర్(జుక్కల్): రజతోత్సవ సభను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుడు దుర్గారెడ్డి కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో సభ వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. నాయకులు రమేష్‌గౌడ్, విఠల్‌రెడ్డి, వెంకటేశం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సరస్వతి ఆలయంలో పూజలు

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ గ్రామ శివారులోని కొలువుదీరిన శ్రీ సరస్వతి మాత ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు దత్తాద్రిశర్మ, ప్రమోద్‌మిశ్రా, అనిల్‌దూబే ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. లలితాసహస్రనామాలతో అమ్మవారికి కుంకుమ అర్చనలు నిర్వహించారు.